సాక్షి
ఆదిలాబాద్

బుధవారం : 27 : సెప్టెంబర్ : 2023



ఘనంగా గణేశ్ నిమజ్జనం

వినాయక నిమజ్జనంను పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. తాంసి మండలంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ పాల్గొన్నారు. 9లో▸



కలెక్టర్ పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి సమీపంలో గల శ్రీ మహాగణపతి ఆలయాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగాప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్ గార్డెన్‌లో మంగళవారం చాకలి ఐలమ్మ 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారన్నారు. అంతకు ముందు రిమ్స్ ఆసుపత్రి ఎదుట గల ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్, బీసీ సంఘం నాయకులు, ప్రజలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు, బీసీ సంఘం నాయకులు దత్తు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



బ్యాంక్ అధికారితో మాట్లాడుతున్న శంకర్

ఆదిలాబాద్‌రూరల్: రైతుల ఖాతాల్లో జమ అయిన రైతుబంధును బ్యాంక్ అధికారులు క్రాప్ లోన్ కింద రికవరీ చేసుకోవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ కోరారు. పలువురు రైతులు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు చేరుకొని అధికారులతో మాట్లాడారు. రైతుల ఖాతాల్లో జమ అయిన రైతుబంధు డబ్బులను పంట రుణాల కింద జమ చేసుకొవద్దన్నారు. ఆయన వెంట పలువురు రైతులు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో రవీందర్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. అలాగే ప్రతీ విద్యార్థిపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ శంకర్, మొహిసిన్, అధ్యాపకులు ఉన్నారు.


క్రీడా శిక్షకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో క్రీడా శిక్షకుల పోస్టుల భర్తీ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. బాక్సింగ్, అథ్లెటిక్స్ విభాగాలకు గ్రేడ్ 3 శిక్షకులు అయితే డిగ్రీ, బీ పీఈడీ, ఎంపీఈడీ, ఎన్ఎస్ఐ కోచింగ్ (డిప్లొమా) కోర్సు, గ్రేడ్ 4 కోచ్ కోసం ఎన్ఎస్ఐ సర్టిఫికెట్ కోర్స్ గుర్తింపు పొందిన జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు అర్హులని తెలిపారు. జిల్లాకు చెందిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని, సెప్టెంబర్ 30న స్టేడియంలో గల క్రీడా పాఠశాలలో ఉదయం 11 గంటలకు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఆఫీస్ సూపరింటెండెంట్‌ను 8500549321 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అభ్యంతరాలకు నేడే ఆఖరు

ఎదులాపురం: ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతి అభ్యంతరాలకు ఈనెల 27 తుది గడువని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలపై సరైన ఆధారాలతో ఉదయం 11 గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. స్పౌజ్ తొలగింపు, స్పౌజ్ పాయింట్ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలోని ఓ లేఅవుట్ (ఫైల్)



భారీ స్కెచ్..

- కోట్ల రూపాయల వసూలే లక్ష్యం..
- మావల తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్లాన్
- పలువురు భూయజమానులకు నోటీసులు..?
- సరిచేసుకోవాలంటూ రెండు నెలలుగా సంప్రదింపుల పర్వం!
- మధ్యలో ఏసీబీ దాడితో బెడిసికొట్టిన వ్యవహారం

సాక్షి,ఆదిలాబాద్: కోట్ల రూపాయలు దండుకోవాలనే భారీ స్కెచ్ పటాపంచలైంది. భూముల పత్రాలకు సంబంధించి లోపాలను సవరించుకోవాలంటూ మావల తహసీల్దార్ కార్యాలయం నుంచి ఓ భారీ కుతంత్రం జరిగిందనే ప్రచారం సాగుతోంది. భూయజమానులకు నోటీసులు జారీ చేయడం, దానికి అనుగుణంగా ఎవరైనా సరిచేసుకునేందుకు ముందుకు వస్తే ముందుగా రూపొందించిన అక్రమ ప్రణాళిక అమలుపర్చడం ఇందులో భాగం. సుమారు 80 మందికి ఇలాంటి నోటీసులు జారీ చేశారనే ప్రచారం ఉంది. అయితే ఈ ప్రక్రియ అధికారికంగా జరిగిందా.. అనధికారికంగా జరిగిందా అనే దానిపై స్పష్టత లేదు. రెవెన్యూ శాఖలో ఇలాంటి వ్యవహారాల్లో ఆరితేరిన వారిని ముందుంచి ఎవరైనా రాజకీయ నాయకుడు వెనుకుండి వ్యవహారం నడిపారా అనే అనుమానాలు కూడా లేకపోలేదు. మధ్యలో పేరు మార్పునకు సంబంధించి పెద్ద మొత్తంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి తహసీల్దార్, ఆర్ఐను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం సంచలనం కలిగిస్తుంది.

కోట్ల విలువైన భూములు..

మావలలో ఎవరికైన ఒక ఎకరం భూమి ఉందంటే అతన్ని కోటీశ్వరుడు అంటారు. ఎందుకంటే ఆదిలాబాద్ శివారులో ఉన్న ఈ మండలంలో ఎకరం భూమి విలువ రూ.2 కోట్ల నుంచి రూ.3కోట్లకు పైగా పలుకుతోంది. అయితే ఈ మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అనేక సర్వేనంబర్లలో ఉన్నాయి. ప్రైవేట్ భూములకు ఆనుకొని ఉన్న ఈ అసైన్డ్ భూములను పలువురు ఆక్రమించుకున్నారు. అంతేకాకుండా గతంలో అసైన్డ్‌దారుల నుంచి పలువురు ఈ భూములను కొనుగోలు చేశారు. ఇవి రియల్ వెంచర్లుగా తయారయ్యాయి. అయితే ఈ వెంచర్లలోని లోపాలపై అవగాహన ఉన్న రెవెన్యూ అధికారులు ఈ భారీ ప్రణాళికకు స్కెచ్ వేశారనే ప్రచారం సాగుతోంది. దానికి అనుగుణంగా నోటీసులు జారీ చేయడం, భూ యజమానులు సవరణతో ముందుకొస్తే విస్తీర్ణానికి అనుగుణంగా పెద్ద ఎత్తున డబ్బుల డిమాండ్ సాగిందని చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఇలాంటి నోటీసులకు సంబంధించి ఎన్నింటికి సవరణలు చేశారనే విషయం బయటకు రాలేదు.

స్పష్టత కరువు..

సాధారణంగా ధరణి పోర్టల్ తెలంగాణ మాడ్యుల్ (టీఎం) 30లో భూములకు సంబంధించి ఏమైనా పొరపాట్లు ఉంటే భూ యజమానులు దరఖాస్తు చేసుకున్న పక్షంలోనే శాఖాపరంగా అధికారికంగా నోటీసులు జారీ చేయడం ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కాగా మావలలో జరిగిన నోటీసుల వ్యవహారం అధికారికంగా జరిగిందా.. అనధికారికంగా జరిగిందా అనే దానిపై ఉన్నతాధికారుల వద్ద స్పష్టత లేదు. ఇదిలా ఉంటే.. ఏసీబీ దాడి కేసులో బాధితులు నేరుగా తమ భూములకు సంబంధించి పేర్ల సవరణ కోసం రెవెన్యూ అధికారులను ఆశ్రయించినట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

అనధికారికంగా నోటీసుల జారీపై స్పష్టత లేదు



మావల తహసీల్దార్ కార్యాలయం నుంచి భూయజమానులకు అనధికారికంగా నోటీసులు జారీ చేశారా అనే విషయంపై స్పష్టత లేదు. సాధారణంగా టీఎం మాడ్యుల్‌లో దరఖాస్తు చేసుకుంటే దానికి సంబంధించి నోటీసులు జారీ చేసి సవరించడం జరుగుతుంది. ఇది నిరంతర ప్రక్రియ.

– స్రవంతి, ఆర్డీవో, ఆదిలాబాద్

సైజు..మాయాజాలం!



- ఈ నెల 16న తాంసి మండలం మత్తడి వాగు ప్రాజెక్ట్‌లో చేపపిల్లల సీడ్ పంపిణీకి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు హాజరయ్యారు. 10 వాహనాల్లో చేప పిల్లలను తీసుకువచ్చిన కాంట్రాక్టర్ శాంపిల్స్‌గా కొన్నింటిని లెక్కించి నీటిలో వదిలారు. ఈక్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన సైజు కంటే పిల్లలు తక్కువగా ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే వాటిని చేతిలోకి తీసుకుని అధికారులను మందలించారు. ఈ సారి తక్కువ సైజు వచ్చాయని మరోసారి ఇలా రాకుండా చూస్తామని అధికారులు తప్పించుకుని కాంట్రాక్టర్‌ను కాపాడే యత్నం చేశారు. అయితే ప్రతీసారి తక్కువ సైజు చేప పిల్లలతో పాటు వాటి లెక్కింపులోనూ గోల్‌మాల్ ఉంటుందని మత్స్యకారులు చెబుతుండడం గమనార్హం.

- చేప పిల్లల పంపిణీలో అవకతవకలు
- తక్కువ పరిమాణం కలిగినవి సరఫరా
- లెక్కింపులోనూ గోల్‌మాల్ అంటున్న మత్స్యకారులు
- కాంట్రాక్టర్‌కు వంతపాడుతున్న అధికారులు

కైలాస్‌నగర్: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా వర్షాకాలంలో చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఉచితంగా అందిస్తున్న వీటితో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందారో లేదో తెలియదు కానీ కాంట్రాక్టర్లు, సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు మాత్రం ఏటా లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. చేప పిల్లల పంపిణీలో నిబంధనలు పాటించకపోవడం, ఏ మాత్రం గ్రేడింగ్ లేని నాసిరకం, తక్కువ పరిమాణం ఉన్న వాటిని అంటగడుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో వీటిని వదిలే సమయంలో మత్స్యసహకార సంఘాలకు, కాంట్రాక్టర్లకు లోపాయికారి ఒప్పందం ఉండటంతో వారు చేప పిల్లల నాణ్యత, సైజు, సంఖ్య వంటి విషయాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలేంటంటే..

చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు కాంట్రాక్టర్లు తిలోదకాలిస్తున్నారు. జలాశయాల్లో వీటిని వదిలే ముందు వాటి సంఖ్యను ముందుగా ఆయా సంఘాలకు తెలియజేయాలి. చేప పిల్లల నాణ్యత, వాటి సంఖ్యలో తేడాలు ఉన్నట్లు మత్స్యకారులు గుర్తించి అధికారులు దృష్టికి తీసుకువస్తే వాటిని తిరస్కరించే అధికారం జిల్లా మత్స్యశాఖ అధికారికి ఉంటుంది. రిజర్వాయర్లలో వేసే 80–100ఎంఎం పరిమాణం ఉన్న చేప పిల్లల సంఖ్య సక్రమంగా ఉందా లేదా అనే దాన్ని తెలుసుకునేందుకు కచ్చితమైన నిబంధనలున్నాయి. ఈ సైజు చేప పిల్లలను కిలోల లెక్కన తూకం వేసి వదులుతారు. ఒక కిలోకు 300 నుంచి 350 పిల్లలు రావాలి. అంత కంటే ఎక్కువగా వస్తే వాటి సైజు తక్కువగా ఉన్నట్లుగా గుర్తించి వాటిని అధికారులు తిరస్కరించవచ్చు. చెరువులు, రిజర్వాయర్లలో వేసే ముందు తప్పనిసరిగా వాటిని తూకం వేశాకే వదలాలి.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

రాజకీయ అండదండలతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చేప పిల్లల పంపిణీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్ట్‌లో చేప పిల్లలను వదిలారు. ఒకేసారి లక్షల్లో తీసుకురాగా.. వీటిని తూకం వేసి వదలడానికి చాలా సమయం పడుతుంది. అయితే ఇక్కడే కాంట్రాక్టర్ తెలివిగా వ్యవహరిస్తారు. ఎంపిక చేసిన వాహనాల్లోని చేప పిల్లలను శాంపిల్స్‌గా తీసుకుని తూకం వేస్తున్నారు. ప్రణాళిక ప్రకారం చేపట్టడంతో ఇవి నిబంధనల ప్రకారమే ఉంటున్నాయి. ఇక అన్నింట్లో అలాంటి చేప పిల్లలున్నాయనేలా మత్స్యకారులను నమ్మించి వదులుతున్నారు. దీంతో తక్కువ సైజు, నాసిరకంతో పాటు పంపిణీ చేయాల్సిన వాటి కంటే తక్కువగా సరఫరా చేసి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీనిని గుర్తించాల్సిన పారిశ్రామిక సంఘాల సభ్యులను మచ్చిక చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఫలితంగా వారు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం

మత్తడివాగులో వేసే సమయంలో కొన్ని మాత్రమే తక్కువ సైజు చేప పిల్లలు వచ్చాయి. నిబంధనల మేరకు వాటిని సరఫరా చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. నాసిరకం, సైజు తక్కువ గల చేప పిల్లలను తీసుకువస్తే వాటిని చెరువులో వేయకుండా తిరస్కరిస్తాం. మత్స్యకారులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- కొనుగోళ్లకు ఆధార్ కార్డే ప్రామాణికం
- కలెక్టర్ రాహుల్‌రాజ్



వ్యాపారులు, అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: రైతులు పండించిన పత్తి పంట కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం సీజన్ పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2023–24 సీజన్ పత్తి కొనుగోళ్ల ప్రారంభం కానున్న దృష్ట్యా మార్కెట్ యార్డుల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రామాణికమని దీనిపై వారికి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పంచాయతీల వారీగా షెడ్యూల్ రూపొందించాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే తేమశాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లను సమకూర్చాలని, తూకం యంత్రాల పనితీరు పరిశీలించుకోవాలని సంబంధిత శాఖ అధికారులను సూచించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా, పోలీస్, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు వారి అభిప్రాయాలు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఇన్‌చార్జి డీఆర్‌వో రాథోడ్ రమేశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, విద్యుత్, రవాణా, పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నిజాయతీగా వినియోగించుకోవాలి



ర్యాలీలో భాగంగా ఆటోలో కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ నిజాయతీగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటరు నమోదు, వినియోగంపై ప్రజలను చైతన్యపరిచేందుకు మంగళవారం పట్టణంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. అభివృద్ధి రావాలి– ఓటు కావాలి అనే స్టిక్కర్లను కలెక్టర్ ఆటో డ్రైవర్లకు పంపిణీ చేసిన అనంతరం ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. స్వయంగా ఆయన ఆటోలో ఎక్కి ర్యాలీలో పాల్గొనడాన్ని ప్రజలు ఆసక్తిగా గమనించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగకుండా నిజాయతీగా ఓటు వేయాలన్నారు. జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఈసీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఎంపీఐ శ్రీనివాస్, ఆటోయూనియన్ నాయకులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తలమడుగు: పోలీస్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని ఎస్పీ డి. ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. రా నున్న ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మద్యం, డబ్బు తరలిరాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గణేశ్ నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సైదారావు, స్థానిక ఎస్సై ధనశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏడీకి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తపస్ జిల్లా నాయకులు మంగళవారం విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో వచ్చిన సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, బోగస్ సర్టిఫికెట్లు సమర్పించిన వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించడమే కాకుండా శాఖాపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పదోన్నతుల్లో భాగంగా గతంలో రెండుసార్లు నాట్ విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను గుర్తించి, జాబితా నుంచి తొలగించి తర్వాత స్థానంలో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన నూతన రోస్టర్ విధానాన్ని పాటిస్తూ పారదర్శకంగా పదోన్నతుల ప్రక్రియ నిర్వహించాలని విన్నవించారు. ఇందులో తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్, జిల్లా నాయకులు సురేష్, రవీందర్, గంగాధర్ ఉన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీధర్

ఎదులాపురం: పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీధర్ అన్నారు. పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డులో మంగళవారం డ్రైడే పాటించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం మాట్లాడారు. డెంగీ కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. శుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఇందులో డెప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

కైలాస్‌నగర్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు సమీపంలో గల ఆయన విగ్రహం వద్ద అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి పద్మశాలి కులస్తులు, బీసీ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

- 16వ రోజుకు సమ్మె



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ..

ఎదులాపురం: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. మంగళవారం పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇందులో అంగన్‌వాడీలు పార్వతి, సుజాత, మంజుల కవిత, తదితరులున్నారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు లోక్‌సభ స్పీకర్ అభినందన లేఖ


సంతోష్‌కుమార్

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం బేదోడ్కర్ సంతోష్ కుమార్ సెప్టెంబర్ 5న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. కాగా, సంతోష్‌కుమార్‌ను అభినందిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పోస్టు ద్వారా లేఖ పంపించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఇద్దరిలో మీరు ఒకరు కావడం పాఠశాల, రాష్ట్రానికి గర్వకారణమని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉన్నతికి, విద్యార్థుల చదువుకు మీరు చేస్తున్న కృషి అభినందనీయమని అందులో సంతోషకుమార్‌ను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని సూచించారు. కాగా, లోక్‌సభ స్పీకర్ సంతోష్‌కుమార్‌కు అభినందన లేఖ పంపడంపై మండల ఉపాధ్యాయులు, నిపాని గ్రామస్తులు హర్షం వ్యక్తంజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో అడ్మిషన్ల కోసం గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైటెక్‌సిటీ, మాదాపూర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇంపర్‌టింగ్ ఒకేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో శిక్షణ పొందగోరే వారు 18–35 ఏళ్లలోపు ఉండాలని, 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు అక్టోబర్ 5లోపు సంబంధిత గిరిజన సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


రెండుతలల దూడ జననం


రెండు తలల దూడ

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామానికి చెందిన అర్షప్రసాద్ అనే రైతుకు చెందిన గేదె మంగళవారం రెండు తలల దూడకు జన్మనిచ్చింది. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తన గేదె ఈనే లక్షణాలు గమనించిన ప్రసాద్ పశువైద్యుడికి సమాచారం ఇచ్చాడు. ఎంతకూ గేదె ఈనకపోవడంతో వైద్య సిబ్బంది వెంటనే గేదె గర్భం నుంచి ముగ్గురు వ్యక్తుల సాయంతో దూడను బయటకు తీశారు. కాగా, ఆ దూడ రెండు తలలతో వింతగా ఉంది. దీంతో గ్రామస్తులు రెండు తలల దూడను చూసేందుకు ప్రసాద్ ఇంటికి క్యూకట్టారు. అయితే పుట్టిన వెంటనే ఆ దూడ మరణించిందని రైతు ప్రసాద్ తెలిపాడు. ఈ విషయమై లోకేశ్వరం పశువైద్యాధికారి జెస్సీని వివరణ కోరగా.. జన్యుపరమైన లోపంలో ఇలాంటి దూడలు పుడుతాయని, ఇవి ఎక్కువ కాలం జీవించవని పేర్కొన్నారు.

ఆధునికీకరణతోనే మనుగడ

- భారీ వరదలకు కడెం ప్రాజెక్టుకు ముప్పు
- పరిస్థితిపై నివేదిక ఇచ్చిన అధికారులు
- ఎలాంటి చర్యలు చేపట్టని ప్రభుత్వం


కడెం ప్రాజెక్ట్

కడెం: ఉమ్మడి జిల్లాలోనే ప్రధాన సాగు నీటి ప్రాజెక్ట్ కడెం ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట్ మండలాల్లోని సుమారు 70 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. 1958లో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయింది. అప్పుడు తొమ్మిది (జర్మనీ) వరదగేట్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రాజెక్ట్ నిర్మించిన మొదటి ఏడాది వానాకాలం సీజన్‌లోనే భారీ వరదలు రావడంతో కొట్టుకుపోయింది. ఆ తర్వాత ప్రాజెక్ట్‌కు అదనంగా మరో తొమ్మిది వరద గేట్లు ఏర్పాటు చేశారు. 1980లో భారీ వరదలు వచ్చిన ఎలాంటి ముప్పు వాటిల్లక పోగా, 1995లో, గతేడాది జూలై 13న వచ్చిన వరదలతో ప్రాజెక్ట్ దెబ్బతింది. మళ్లీ ఈ ఏడాది జూలై 21న వచ్చిన భారీ వరదలు వచ్చినపుడు గేట్లు మొరాయించడంతో ప్రాజెక్ట్ తెగిపోయే పరిస్థితి వచ్చింది.

డీసీఆర్‌పీ సూచనలు అమలయ్యేనా?

రెండేళ్లుగా భారీ వరదలతో అతలాకుతలమవుతున్న కడెం ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ స్థితిగతులను అధ్యయనం చేయడానికి జూలైలో సీడబ్ల్యూసీ, డీసీఆర్‌పీ బృందాలు కడెం ప్రాజెక్ట్‌ను పరిశీలించాయి. ప్రాజెక్ట్ సామర్థ్యానికి మించిన వరదలు వస్తున్నాయని, క్రాప్ హాలీడే ఇవ్వకుండా ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌ను అలాగే ఉంచి, సుమారు ఆరు లక్షల ఔట్ ఫ్లో సామర్థ్యంతో ప్రాజెక్ట్ ముందే నూతన ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని లేదా ప్రాజెక్ట్‌కు అదనపు గేట్లు ఏర్పాటు చేయాలని, జర్మనీ గేట్ల ఎత్తు పెంచాలని పలు సూచనలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా డీసీఆర్‌పీ నివేదిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందు మెకానికల్ బృందాన్ని కడెంకు పంపింది. నూతన ప్రాజెక్ట్ నిర్మాణామా? అదనపు గేట్లు ఏర్పాటు చేయడమా? అనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కర్రగణేశుని దర్శనానికి భక్తుల తాకిడి


ఆలయ ఆవరణలో భక్తులు

కుభీర్: మండలంలోని సిర్పెల్లి సరిహద్దు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మహారాష్ట్రలోగల పాలజ్ కర్రగణేశుని దర్శనానికి మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ప్రజలు, తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు మంగళవారం అధిక సంఖ్యలో వచ్చారు. దర్శనానికి 3గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

దారులన్నీ పాలజ్ వైపే..

మండలంలోని కుభీర్, పల్సి, నిగ్వా గ్రామాల మీదుగా భక్తులు పాలజ్ కర్రగణేశుని దర్శనానికి వెళ్తున్నారు. ఈ గ్రామాల్లోని ఏరోడ్డును చూసినా పాలజ్‌కు వెళ్లే కార్లు, ఆటోలు, బైక్‌లు కనిపించాయి. సిర్పెల్లి సరిహద్దు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. చాలామంది భక్తులు కాలినడకన కూడా వెళ్తున్నారు.

మోదీ సభకు లక్ష జనసమీకరణ

- బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడి
- నిజామాబాద్ ఉమ్మడి జిల్లా, నిర్మల్, జగిత్యాల జిల్లాల పదాధికారుల సమావేశం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, సూర్యనారాయణ, నాయకులు

సుభాష్‌నగర్: అక్టోబర్ 3న జిల్లా కేంద్రంలో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నగరంలోని బస్వాగార్డెన్స్‌లో ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. సభకు జన సమీకరణ, వివిధ అంశాలపై రాష్ట్ర, జిల్లాల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 3న నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభ నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. సభకు జిల్లాల నుంచి లక్ష మందికిపైగా ప్రజలను సమీకరించాలని సూచించారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ బహిరంగ సభతో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభకు శ్రీకారం చుడతారని తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో అన్ని స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, దక్షిణ తెలంగాణలోనూ పార్టీ బలపడుతోందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, అరుణ తార, ఆయా నియోజకవర్గ నాయకులు ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేశ్ కులాచారి, మల్లికార్జున్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకట్, సత్యనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మేము..

- ఎమ్మెల్యే బాపూరావు పార్టీ మారడం ఆయన వ్యక్తిగతం
- తేల్చిచెప్పిన పార్టీ స్థానిక నాయకులు


మాట్లాడుతున్న సంధ్యారాణి, నాయకులు

బోథ్: ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పార్టీ మారినా.. తాము మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణితో పాటు పలువురు నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాపూరావు పార్టీ మారడం ఆయన వ్యక్తిగతమన్నారు. సీఎం కేసీఆర్ బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అనిల్ జాదవ్‌ను ప్రకటించారని, ఆయన్నే తాము ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. ఎవరికైనా పార్టీతోనే గుర్తింపు వస్తుందన్నారు. ఇందులో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, సొనాల సర్పంచ్ సదానందం, ఆత్మ చైర్మన్ సుభాష్, గ్రంథాలయం జిల్లా డైరెక్టర్ రమణగౌడ్, యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్, రఫీ, నాయకులు తదితరులున్నారు.

అయోమయంలో బాపూరావు అనుచరులు..

తనకు టికెట్ కేటాయించకపోవడంపై పార్టీ అధిష్టానంపై ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలోనే త్వరలో తన రాజీనామా ప్రకటిస్తానని ఆయన ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆయనతో పాటు స్థానికంగా రాజీనామా చేసి వెళ్లేది ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేతో వెళ్లాలా..? లేక పార్టీలోనే ఉండాలా..? అని ఆయన అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. కాగా, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉన్న నాయకులు మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని పేర్కొనడం గమనార్హం.

జల్సాల కోసం చోరీ

- సొంత బాబాయి ఇంటికే కన్నం
- రూ.2 లక్షలు, బంగారం అపహరణ
- 48గంటల్లో ఛేదించిన పోలీసులు


నిర్మల్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద: జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి సొంత బాబాయికి ఇంటికే కన్నమేసి చివరికి పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన హలీమా బేగం భర్త బషీర్ దుబాయి వెళ్లాడు. హలీమా బేగం ఈనెల 22న తన తమ్ముడు ఫరీద్ ఇంట్లో ఫంక్షన్ ఉండగా బాబాపూర్ నుంచి ముటాపూర్‌కు వెళ్లింది. మరుసటిరోజు ఇంటికి చేరుకున్న ఆమె బీరువా పగులగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. బీరువాలోని రూ.75వేల నగదు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్ దర్యాప్తు చేపట్టారు. సోమవారం మండలంలోని న్యూకంజర్ నుంచి లింగంపల్లి గ్రామానికి వెళ్లేదారిలో బైక్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా, తన పేరు అల్లహుద్దీన్ అని, మూడురోజుల క్రితం తన బాబాయి బషీర్ ఇంట్లో చోరీ చేసింది తానేనని అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రూ.75వేలు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ గంగారెడ్డి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. చోరీ జరిగిన రెండు రోజుల్లోనే వేగంగా దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్న సోన్ సీఐ నవీన్‌కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్, పీసీలు సునీల్, కిరణ్, గణేశ్, దిలీప్‌ను నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు. నిందితుడిని నిర్మల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి జైలుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

30న గిరిజనుల సమావేశం


మాట్లాడుతున్న మెస్రం వెంకట్‌రావ్

ఇంద్రవెల్లి: ఈ నెల 30న కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో గిరిజనుల సమావేశం నిర్వహించనున్నట్లు కేస్లాపూర్ రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం ఆవిష్కరణ, జీవో నంబర్ 3, ఉద్యమ కార్యాచరణపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, రాయిసెంటర్‌ల సార్‌మెడిలు, పటేల్, ఆయా గ్రామాల పెద్దలు తరలిరావాలని కోరారు. నాయకులు వెట్టి రాజేశ్వర్‌పటేల్, కినక శేకు, మెస్రం బాదిరావ్, మెస్రం నాగ్‌నాథ్, కోట్నాక్ భారిక్‌రావ్, మెస్రం దుర్గు, తోడసం సాగర్, హెరేకుమ్ర మధు ఉన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీలకు 16 మంది నిర్మల్ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని మంత్రి కార్యాలయంలో వీరితోపాటు యోగా గురువులు మల్లేశ్, అన్నపూర్ణ, చంద్రశేఖర్‌ను మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో గోల్డ్ మెడల్ విభాగంలో అవినాష్, మనీశ్, రవీందర్, చరణ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, యోగా గురువులు ప్రదీప్, సతీశ్, పురుషోత్తం, సుమిత్, పవిత్ర పాల్గొన్నారు.

గణేశ్ మండపంలో ముస్లింల అన్నదానం


భక్తులకు భోజనం వడ్డిస్తున్న ముస్లింలు

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామంలోగల హనుమాన్ గణపతి మండపం వద్ద మంగళవారం ముస్లింలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా, గణపతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ముస్లింలు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ అడిగం రాజు, గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన ముస్లింలను శాలువాలతో సన్మానించారు.

అన్యాయం జరిగిందని ఆత్మహత్యాయత్నం


పురుగుల మందు తాగి డబ్బా చూపిస్తున్న మల్లేశ్

దండేపల్లి: కొడుకు ప్రేమ పెళ్లి వివాదంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ కుటుంబానికి తీరని అన్యాయం చేశారని మండలంలోని మామిడిపల్లికి చెందిన చాతరాజు మల్లేశ్ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లేశ్ కొడుకు సుమన్ ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు బాగానే ఉన్న సుమన్ దంపతుల మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈవిషయంలో గ్రామానికి చెందిన కొందరు తమ కోడలు పక్షాన నిలిచి తమను కేసుల పాలు చేశారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ఆస్తులు అమ్ముకున్నామని మల్లేశ్ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట పోలీసులు, గ్రామస్తులతో వాపోయాడు. ఇదే క్రమంలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. వెంటనే అక్కడే ఉన్న ఎస్సై ప్రసాద్, సిబ్బంది అతడిని తమ వాహనంలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కాగా, లక్సెట్టిపేట ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మల్లేశ్ వాంగ్మూలాన్ని తీసుకున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి


దిగంబర్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన ఆత్రం దిగంబర్ (23) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దిగంబర్ తన మిత్రులతో కలిసి దేగామ గ్రామం నుంచి జాతర్ల గ్రామానికి బైక్‌పై వస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చింది. వెంటనే అతడిని 108లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువచ్చేసరికి అప్పటికే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోన్: నిర్మల్ జిల్లా మేడిపెల్లి గ్రామానికి బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన సోమ రాజేశ్వర్ మంగళవారం మేడిపెల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై సొంతూరికి వస్తున్నాడు. ఈ క్రమంలో కడ్తాల్ గ్రామంలోని రైతువేదిక దాటిన తర్వాత 44వ జాతీయ రహదారిపై ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజేశ్వర్‌కు తల, ఛాతి, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. అతడి భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ రాథోడ్ దయారాం బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది.

అడవిపంది బైక్‌ను ఢీకొని..

తాంసి: ద్విచక్రవాహనానికి అడవిపంది అడ్డు రాగా ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి చెందిన రాకేశ్, లక్ష్మణ్ మంగళవారం సాయంత్రం పంటచేలకు వెళ్లారు. తిరిగి ఇంటికివచ్చే క్రమంలో అడవిపంది ద్విచక్రవాహనానికి అడ్డు వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడ్డ రాకేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా, లక్ష్మణ్ చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఇద్దరిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.


పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో మంగళవారం పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చే సుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలి పారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కిష్టు కొద్దినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రి ఖర్చుల కోసం బ్యాంక్ నుంచి రూ.1.06లక్షలు విత్‌డ్రా చేసి ఇంట్లో భద్రపరిచాడు. ఈ నెల 24న కుటుంబ సభ్యులతో కలిసి భీంసరి గ్రామానికి వెళ్లాడు. ఆయన బంధువు గణేశ్ 26న ఇంటి కిష్టు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి అతడికి సమాచారం ఇచ్చాడు. కిష్టు ఇంటికి వచ్చి చూసి రూ.1.06 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాతకక్షలతో ఒకరి హత్య


ఇమ్రాన్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: పాతకక్షలతో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మోమిన్‌పుర కాలనీకి చెందని షేక్ ఇమ్రాన్ (27)కు జమీర్, ఇర్ఫాన్‌తో పాత కక్షలున్నాయి. జమీర్, ఇర్ఫాన్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉండి ఇమ్రాన్‌ను పిలిచారు. అక్కడికి వెళ్లిన ఇమ్రాన్‌ను గొంతు నులిమి కింద పడేశారు. ఈ క్రమంలో అటుగా వెళ్లిన ఇమ్రాన్ తమ్ముడు అమీర్ గమనించి అన్నను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. రిమ్స్‌కు తరలిస్తున్న క్రమంలో ఇమ్రాన్ మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య హీన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూతురిపై లైంగిక దాడి.. తండ్రికి 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్: సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించి, కన్న కూతురుపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ రమేశ్ తీర్పు వెలువరించారు. పీపీ జీవీఎస్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని జంజిరాల వెంకటి పదో తరగతి చదువుతున్న తన మైనర్ కుమార్తెను తరచూ లైంగికంగా వేధించేవాడు. ఈక్రమంలోనే 2022 జూలైలో ఇంట్లోనే లైంగికదాడికి పాల్పడ్డాడు. 2022 నవంబర్ 13 రాత్రి మరోసారి లైంగిక దాడికి యత్నించగా, బాలిక తల్లి వాణి దృష్టికి తీసుకెళ్లింది. వాణి కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రవీందర్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రిటైర్డ్ కలెక్టర్ ఇంట్లో చోరీ

- రూ.2లక్షలు అపహరణ

జన్నారం: హైదరాబాద్ రిటైర్డ్ కలెక్టర్ శర్మన్‌నాయక్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని కలమడుగు పంచాయతీ పరిధి రాంనాయక్ తండాలో చోటు చేసుకుంది. రిటైర్డ్ కలెక్టర్ మనుమడు లావుడ్యా సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన లావుడ్యా శర్మన్‌నాయక్ రాంనాయక్ తండాలో కుటుంబంతో నివాసముంటున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆయన కూతురు సుజాత, కుటుంబ సభ్యులు రాంనాయక్ తండాలోని తన నివాసంలో ఉంటున్నారు. రోజులాగే ఈనెల 25న రాత్రి 10 గంటలకు భోజనం చేసి నిద్రించారు. 26న ఉదయం 8గంటలకు సుజాత ఇల్లు శుభ్రం చేసేందుకు శర్మన్‌నాయక్ గది వద్దకు వెళ్లేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో గదిలోకి వెళ్లి పరిశీలించగా రూ.2లక్షలు కనిపించలేదు. వెంటనే ఎస్సై సతీశ్‌కు సమాచారం ఇవ్వగా లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. సాయిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు వేయండి

బోథ్: మండల కేంద్రంలోని 16వ వార్డులో రోడ్డంతా బురదమయంగా మారిందని వార్డు సభ్యులు తుకారాం, నాయకులు వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం కాలనీవాసులతో కలిసి వారు మాట్లాడారు. బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నో సార్లు సర్పంచ్‌కు రోడ్డు వేయాలని విన్నించినా పట్టించుకోవడం లేదని వార్డు సభ్యుడు తుకారాం అన్నారు. ఒక వార్డు సభ్యుడిగా చెప్పినా విలువలేకుండా పోయిందని ఆయన వాపోయాడు.

సమ్మె నోటీసు అందజేత

సిరికొండ: ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచి, జూనియార్ అసిస్టెంట్ పే స్కేల్ వేతనం అందించి తమను పర్మినెంట్ చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈ పంచాయతీ ఆపరేటర్లు ఎంపీడీవో సురేష్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆపరేటర్లు రాజేశ్వర్, వినోద్ ఉన్నారు.

నిధులు మంజూరు

బోథ్: టివిటి గ్రామం నుంచి పరుపులపల్లె గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం రూ.10లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కాగా పదిరోజుల క్రితం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ద్వారా రోడ్డుకు నిధులు కేటాయించాలని ఐటీడీఏ పీవోకు లేఖ రాశారని. ఈ మేరకు నిధులు విడుదలైనట్లు ఎంపీపీ తెలిపారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, జోగు రామన్నలకు ధన్యవాదాలు తెలిపారు.

108 వాహనాల తనిఖీ

బోథ్: బోథ్ మండలంలోని 108, 102 వాహనాలను జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, ప్లీట్ జనార్దన్, జిల్లా కో ఆర్డినేటర్ బాదావత్ తిరుపతి మంగళవారం పరిశీలించారు. వాహనంలో మల్టిఛానల్, మానిటర్, సెక్షన్ ఆపరేటర్, బిపి ఆపరేటర్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు 102 వాహనాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఇందులో 108 పైలెట్ గంగయ్య, ఈఎంటీ రమేష్, 102 క్యాప్టెన్ మహేష్, స్వామి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. మంగళవారం మాదపూర్, అడేగామ(కె) ఎస్సీకాలనీ, గిరిజన గురుకుల బాలుర పాఠశాల్లో వైద్యాఆరోగ్య శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్ ఉత్తం, కైలాస్, సుభాష్, ఏఎన్ఎంలు పద్మ, సుధా, గంగామణి పాల్గొన్నారు.

కుస్రం నీలదేవికి సన్మానం


నీలదేవిని సన్మానిస్తున్న దయాకర్‌రెడ్డి

ఇచ్చోడ: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా రెండోసారి ఎన్నికైన కుస్రం నీలదేవిని మంగళవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ క్లోం దయాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన ప్రాత పోషించిన నీలదేవి సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ రెండవ సారి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నేరడిగొండ: శ్రీరామోజీ లక్ష్మి వెంకన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ టీచర్ నారాయణ వారి తల్లితండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులుగా నాగభూషణం (బుగ్గారం బి), గణేష్ (కుంటాల), విజయ లక్ష్మి (నేరడిగొండ కాలనీ), మమత (కుమారి) ఎంపిక చేసి వారికి మండల విద్యాధికారి భూమారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే నూతనంగా పీజీహెచ్‌ఎంగా పదోన్నతిపై వచ్చిన సత్యనారాయణ గౌడ్, మనిలత, పద్మ లను టీచర్స్ జేఏసీ పక్షాన సన్మానించారు.

ఎమ్మెల్సీలను ఆమోదించాలి

కైలాస్‌నగర్: గవర్నర్ కోటాలో దాసోజ్ శ్రవణ్ ఎమ్మెల్సీ పదవీని గవర్నర్ ఆమోదించాలని రాష్ట్ర విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు సామన్‌పెల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శి స్వామి డిమాండ్ చేశారు. రాష్ట్ర క్యాబి నేట్ ఆమోదించి పంపించిన ఫైల్‌ను తిరస్కరించడమంటే బడుగు, బలహీనవర్గాలను రాజకీయాలకు దూరం చేయడమేనన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళ్లాలి


నేరడిగొండ: విగ్రహాన్ని ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న బలరాం జాదవ్, గ్రామస్తులు

నేరడిగొండ: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తేజపూర్‌లో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం తెలంగాణ విముక్తి ఉద్యమంలో మెరిసిన అగ్ని కణమే వీరనారి ఐలమ్మ అన్నారు. సర్పంచ్ ప్రఫుల్ చందర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు పోతారెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి జంగపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు దశరథ్, సంఘం సభ్యులు రమణ, సర్వేష్, చోక్కపెల్లి రాములు, గట్టు నారాయణ, సాబ్లే సంతోష్, భీంరావ్, చంపత్, రాథోడ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని చాటిచెప్పిన ఐలమ్మ

ఇంద్రవెల్లి: తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ దత్త అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సేవా దల్ మండల అధ్యక్షులు మానిక్‌రావ్, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సంతోష్‌నాయక్, గ్రంథాలయ సిబ్బంది దళితానంద్ ఉన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం చాకలి ఐలమ్మ జయంతి రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు అరుగుల గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి నారయణ, కోశాధికారి గంగాధర్, నాయకులు శేఖర్, భూమన్న, ప్రవీణ్, కృష్ణ పాల్గొన్నారు.

ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: మహిళలు వీరనారి చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సాజిద్ ఖాన్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్ రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎదుట గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి స్థానిక సంఘ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు జాడి సుభాష్, సంఘ నాయకులు నివర్తి, శివ, ఆకాష్, కేశవ్, విక్రం, బాలాజీ పాల్గొన్నారు.

ఐలమ్మ నేటి తరానికి స్ఫూర్తిదాయకం

జైనథ్: తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకమని సర్పంచ్ జగదీష్ రెడ్డి అన్నారు. గ్రామస్తులు దేవన్న, రాజు, కొండ్ర గణేష్ యాదవ్, సంతోష్, సోమేష్ పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

బోథ్: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు కట్ట భూమేష్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

ఉట్నూర్‌రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఎంపీపీ జైవంత్ రావు, ఏపీఓ రజినికాంత్, సర్పంచ్‌లు కళావతి, హరినాయక్, కార్యదర్శి సచిన్ పాల్గొన్నారు.

రుయ్యడిలో..

తలమడుగు: మండలంలోని రుయ్యడి గ్రామంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోతరెడ్డి, నాయకులు కిష్టు, విష్ణు వర్ధన్‌రెడ్డి ఉన్నారు.


ఆదిలాబాద్‌రూరల్: నినాదాలు చేస్తూ..


ఇచ్చోడ: చిత్ర పటానికి నివాళులర్పిస్తూ..


జైనథ్: నినాదాలు చేస్తున్న నాయకులు


బోథ్: నివాళులర్పిస్తున్న సర్పంచ్, నాయకులు


గుడిహత్నూర్: పాల్గొన్న నాయకులు


ఇంద్రవెల్లి: పూలమాల వేస్తున్న నాయకులు

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి


పూజలు చేస్తున్న ఎస్సై సునీల్ దంపతులు

ఇంద్రవెల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియువత వాతావరణంలో నిర్వహించాలని ఎస్సై డి.సునీల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సర్వజనిక్ గణేష్ మండపం వద్ద దంపతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గణేష్ ఉత్సవాలు, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను శాంతియువత వాతావరణంలో నిర్వహిస్తే పోలీసుల సహకారం ఉంటుందన్నారు. అదేవిధంగా నేటి యువత సంస్కృతి, సంప్రదాయలను కాపాడి భావితరాలకు అందించడానికి కృషి చేయలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు కేంద్రే అజయ్, మనోజ్, జ్ఞానేశ్వర్, గ్రామ పెద్దలు కేశవ్ ముస్లే, సంతోష్‌లాల, జవహర్ లాల్, విజయ్, గైను, కేంద్రే బాలాజీ ఉన్నారు.

వినూత్న నిరసన


నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నార్నూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్న భోజనం కార్మికులు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మాట్లాడారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు జాడే నాందేవ్ ఉన్నారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా మారుస్తా

- బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఇంద్రవెల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ఖానాపూర్‌ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తానని బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గట్టిపల్లి, దోడందా, ఇంద్రవెల్లి, ముత్నూర్, దనోర బి, శంకర్‌గూడ తదితర గ్రామాల్లో పర్యటించారు. బీఆర్ఎస్, ఉత్సవ కమిటీల సభ్యులతో కలిసి గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, సర్పంచ్‌లు లఖన్ ఉన్నారు.


గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో జాన్సన్‌నాయక్

బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలి

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని, తరలిపోయిన కార్యాలయాలను వెనక్కి రప్పించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం ప్రకటించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు డప్పులతో ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, అశోక్, కారెం రవి ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

'రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని పార్టీ నాయకులు దీమా వ్యక్తం చేశారు. తుక్కుగూడలో ప్రకటించిన అభయ హస్తం గ్యారంటీ కార్డులను మంగళవారం మండలంలోని భీంసరి గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డిలు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుబే సంజయ్ పాల్గొన్నారు.


గ్యారంటీ కార్డులు అందిస్తున్న నాయకులు

ఘనంగా వినాయక నిమజ్జనం

తాంసి: గ్రామాల్లోని ప్రజలు ఐక్యతతో గణపతి నవ రాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. మంగళవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో శోభాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన శోభాయాత్రలో నృత్యాలు చేశారు. గ్రామసర్పంచ్ నర్సింగ్, వైస్ ఎంపీపీ రఘు, నాయకులు ఉన్నారు.

శోభాయాత్ర

నార్నూర్: మండలంలోని ఇందిరానగర్, విజయ్‌నగర్ కాలనీలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, అన్నాభావు సాఠె కమిటీ మండలాధ్యక్షుడు కొర్రెల్ల మహేందర్ ఉన్నారు.

నిమజ్జనానికి వినాయకుడు..

సిరికొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని చుట్టుప్రక్కల గ్రామాల్లో మంగళవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణపతి లడ్డూ వేలం వేయగా మండల కేంద్రానికి చెందిన ఓరగంటి ఆశన్న రూ.8000లకు దక్కించుకున్నాడు. బోయవాడకాలనీలో బోదాసు పెద్దగంగన్న రూ.10500లకు దక్కించుకున్నాడు.

శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఆదిలాబాద్: గణేష్ నిమజ్జనోత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలోని సూర్యశాంతి గణేష్ మండల్ నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సాయిరెడ్డి, రవి, రాజు, ప్రశాంత్, రంజిత్ ఉన్నారు.


నార్నూర్: పూజలు పాల్గొన్న భక్తులు


సిరికొండ: లడ్డూను అందుకుంటున్న భక్తులు


చైర్మన్‌ను సన్మానిస్తున్న మండప నిర్వాహకులు

పోరాటాలతోనే కుల నిర్మూలన


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్

ఎదులాపురం: బలమైన ప్రజా పోరాటాలతోనే కుల నిర్మూలన సాధ్యమని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో మంగళవారం జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వామన్, సురేష్, సుభాష్, అశోక్, నితిన్, శ్రవణ్, రవి, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వ్యవసాయ సహకార సంఘాలు

బజార్‌హత్నూర్: జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సరసమైన ధరల్లో అందుబాటులో ఉంచామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్యాక్స్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఈవో శ్రీధర్ రెడ్డి, బజార్‌హత్నూర్, బోథ్ ప్యాక్స్ చైర్మన్లు మేకల వెంకన్న యాదవ్, ప్రశాంత్, నానం రమణ, అల్కే గణేష్, నాగయ్య, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు

బోథ్: బోథ్, సొనాలలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మంగళవారం పర్యటించారు. సొనాల గ్రామంలో సహకార శాఖ స్థలంలో బ్యాంకు కోసం స్థలాన్ని పరిశీలించారు. కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు. అనంతరం బోథ్ మండల కేంద్రంలోని గోదాం పరిశీలించారు. బోథ్, సొనాల సర్పంచులు సురేందర్ యాదవ్, సదానందం, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సీఈవో శ్రీధర్ రెడ్డి, బ్యాంకు మేనేజర్ పోశెట్టి ఉన్నారు.


సొనాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

సంక్షిప్త వార్తలు

ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీకి సన్మానం

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రాజేశ్వర్ మాదిగ అధ్యక్షతన జిల్లా కమిటీని మంగళవారం సన్మానించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పాలెపు గణేష్ మాదిగ, ఉపాధ్యక్షుడు బారుకుంట సుభాష్ మాదిగ, మండల అధ్యక్షుడు సింగారపు స్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ పసుల శ్రీకాంత్ మాదిగలను కుమారి మాదిగ పెద్దల సమక్షంలో సత్కరించారు. సీనియర్ నాయకులు గజ్జల అశోక్, కొత్తపల్లి భూమేశ్, బిక్కి అడెల్లు మాదిగ, మండల నాయకులు బిక్కీ రాకేష్ మాదిగ, గజ్జెల గంగాధర్, ప్రవీణ్, బీక్క గంగాధర్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల అధ్యాపకుల నిరసన

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల అధ్యాపకులు మంగళవారం లంచ్ అవర్‌లో నిరసన చేపట్టారు. హవర్లీ బేస్డ్ టీచర్లుగా గత 8 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించక పోవడం విచారకరమన్నారు. హెచ్‌బీటీలు జి.పాండురంగ్, కె. రాజేశ్వర్, రాజేందర్ గౌడ్, జగదీష్ కుమార్, ప్రవీణ్, నాగుల సవిత ఉన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

నేరడిగొండ: విద్యార్థుల హాజరు శాతం పెంచాలని మాధ్యమిక అధికారి రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపల్, లెక్చరర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, సూపరింటెండెంట్ షేక్ మోసిన్ పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని ఆశల నిరసన

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్‌తో ఆశ కార్యకర్తలు చేపట్టిన సమ్మె 2వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరంలో ఆశ కార్యకర్తలు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షన్

ఎదులాపురం: మున్సిపల్ సానిటరీ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సానిటరీ ఇన్స్‌పెక్టర్లు నరేందర్, భాగ్య, నీరజ విద్యార్థులతో స్వచ్ఛ సర్వేక్షన్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వయం సహాయక బృందం సభ్యురాలు సంగీతా శర్మ కళాశాలలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత ప్రారంభించారు.

మూడు రోజులు స్విమ్మింగ్‌పూల్ మూసివేత

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్ మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు స్విమ్మింగ్ కోచ్ కృష్ణ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాల కారణంగా స్విమ్మింగ్ పూల్ నిర్వహణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 30న మళ్లీ ప్రారంభమవుతుందని వెల్లడించారు.

భగవద్గీత పంపిణీ చేసిన ఆర్మీ ఉద్యోగి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన ఆర్మీ ఉద్యోగి మహేష్ గ్రామంలోని ఈశ్వర్ గణేష్ మండల్ వద్ద మంగళవారం రాత్రి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. భగవద్గీతను తీసుకున్న వారు వాటిని చదివి భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో మంగళవారం కేజీఆర్ ఫౌండేషన్ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కొల్లూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ... కొల్లూరి గంగారాం జన్మదిన సందర్భాగా కేజీఆర్ ఫౌండేషన్‌ను స్థాపించినట్లు తెలిపారు. సభ్యులు వంశీకృష్ణ, రవి పాల్గొన్నారు.

పరామర్శ

జైనథ్: మండలంలోని మాకొడ గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మల స్మామి రెడ్డి కుటుంబ సభ్యులను రాష్ట్ర డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి పరామర్శించారు. ఇటీవలే స్వామి రెడ్డి మృతి చెందగా మంగళవారం లోక భూమారెడ్డి మాకొడకు చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో గావ్‌సాత్ పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని తుమ్మగూడ, పోల్లుగూడ గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు గావ్‌సాత్ పూజలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమెరలో గ్రామస్తులంతా నైవేద్యాలతో వెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించారు. అనంతరం గ్రామస్తులంతా సహపంక్తి భోజనలు చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తాంసి: పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీఏ పీడీ కిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కళాశాల ఆవరణలో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్ జావిద్ అన్వర్, ఎంపీవో సుధీర్ రెడ్డి, గ్రామసర్పంచ్ కృష్ణ, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్ ఉన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

తాంసి: గత 16 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండల కేంద్రంలో అంగన్‌వాడీలు మంగళవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు విజయలక్ష్మి, సరితా, మమత, రూప, సీఐటీయూ నాయకుడు స్వామి ఉన్నారు.

ఇచ్చోడ: మండలంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఇకనైనా సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు.

నార్నూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది బానోత్ జగన్ అన్నారు. ఆయన వెంట బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రాథోడ్ బిక్కు, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు జాడే నాందేవ్ ఉన్నారు.

ఇంద్రవెల్లి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు సుభద్ర అన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు.